క్లుప్తంగా

సీతారామాంజనేయస్వామి దేవాలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల కేంద్రంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మౌని అమావాస్య సందర్భంగా గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో హనుమాన్ చాలీసాతో పాటు భజన పాటలను భక్తులు ఆలపించారు. అనంతరం భక్తులకు గ్రామానికి చెందిన గంప శ్రీనివాస్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, యాదయ్యచారి, శేఖర్, నర్సింహ, వెంకటయ్య, చంద్రయ్య గుప్తా, జంగయ్య, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సతీశ్‌రెడ్డి



జెండా ఆవిష్కరణకు బయలుదేరిన షాబాద్ బీజేపీ నాయకులు

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సతీశ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్లలో 30 అడుగుల జెండా ఆవిష్కరణకు షాబాద్ మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి ప్రతీ గ్రామంలో బీజేపీని పటిష్ట చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, జిల్లా యువ మోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు రాజీవ్‌రెడ్డి, సురేశ్, మహేశ్, కృష్ణచారి, ప్రశాంత్, విఠలయ్య, రవీందర్, విజయ్, ఆనందం, మల్లేశ్, జగదీశ్, శివారెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, శివరాజ్, తదితరులు ఉన్నారు.

గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: ప్రజా గాయకుడు గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయిన విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ విమర్శించారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గద్దర్ తన ఆటాపాట ద్వారా చేసిన ప్రజా పోరాటాలు మంత్రికి తలియదా అని ప్రశ్నించారు. సంజయ్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గద్దర్ పదవులు, డబ్బు, అవార్డుల కోసమో తన జీవితాన్ని పణంగా పెట్టి పని చేయలేదని, తెలంగాణ కోసం, పీడిత, పేద ప్రజల కోసం, అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ పోరాడారని అలాంటి యుద్ధనౌక గద్దర్‌ను అర్థం లేకుండా బండి సంజయ్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న గొప్ప కళాకారుడు యుద్ధనౌక గద్దర్ అని అన్నారు. బండి సంయ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

ఇది పేదల ప్రభుత్వం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచాల: బడుగు, బలహీన వర్గాల కోసం పని చేసే ప్రభుత్వం మాది అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్నంలోని క్యాంప్ కార్యాలయంలో మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.11లక్షల 71 వెయ్యి 500ల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నాడు, అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు రమాకాంత్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, పాండు, లింగంగౌడ్, గణేశ్, వెంకటేశ్, సత్తయ్య, బాలునాయక్, రాజు గౌడ్, రామదాస్, శ్రీను, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పదికి ప్రత్యేక తరగతులు

- వార్షిక పరీక్షలకు సన్నద్ధత
- మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహణ



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ

మొయినాబాద్‌రూరల్: ఈ విద్యాసంవత్సరంలో మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత, 10/10 మార్కులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. ఇందుకు గాను ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలనుసారం గత సంవత్సరం నవంబర్ 1 నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక తరగతులు వచ్చే నెల ఫిబ్రవరి 28 వరకు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించనున్నారు.

సబ్జెక్టుల వారీగా.. సందేహాలను నివృత్తి చేస్తూ

మొయినాబాద్ మండలంలోని 14 జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు కూడా సబ్జెక్టుల వారీగా శ్రద్ధ తీసుకొని పరీక్షలకు సంబంధించిన ముఖ్య అంశాలకు బోధిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులు కూడా పాఠశాల సమయం కంటే గంట ముందు, సాయంత్రం గంట తర్వాత పాఠశాలలో ఉంటూ ఉపాధ్యాయులు చెబుతున్న అంశాలను శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 128 మంది విద్యార్థులు ఉండగా అందులో 28 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రతి రోజు పాఠశాలలో ఉదయం, సాయంత్రం గంట అదనంగా సమయం కేటాయిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం బోధించిన సబ్జెక్టునే ఉదయం బోధిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులను సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా 2–3 రోజులకొకసారి రాతపరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్, తాగునీరు అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటూ పది జీపీఏ సాధించేందుకు కృషిచేస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులు నెలరోజుల్లో ముగియనున్నాయి.

పట్టు సాధిస్తున్నాం



ప్రతీ సబ్జెక్టుపై తమకు మంచి పట్టు సాధించేందుకు ఈ ప్రత్యేక తరగతులు ఎంతో దోహదపడుతున్నాయి. అన్ని సబ్జెక్టులలో ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించి బోధిస్తున్నారు.

–శాలిని, 10వ తరగతి

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజువారీగా సబ్జెక్టుల పరంగా అందరూ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధిస్తున్నారు. ఈ సంవత్సరంలో జరిగే పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు 10/10 మార్కులు సాధించేందుకు అందరం కృషి చేస్తున్నాం. విద్యార్థులకు సైతం ఏ సబ్జెక్టులో సందేహాలు ఉన్నా సరే వాటిని ఉపాధ్యాయులు పరిష్కరిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

–వల్లూరి ఆంజనేయులు, హెచ్‌ఎం, హిమాయత్‌నగర్

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి



నూతన సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న ప్రదీప్‌కుమార్

బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాసెట్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రదీప్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలు వెనుకబడిపోతున్నారన్నారు. సబ్బండ కులాలకు కావాల్సిన అవసరాలను, సంక్షేమ పథకాలను సాధించుకోవాలంటే ఐకమత్యంతో ఉద్యమించాలని సూచించారు. బీసీలు రాజ్యాధికారంతో చట్టసభలలో ప్రవేశించినప్పుడే మన హక్కులను సాధించుకుంటామన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో మనకు మనమే పోటీ కాకుండా మన ఓట్లను మనమే వేసుకొని విజయం సాధించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీ మహాసభ మండల అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్, తాలుకా యువత విభాగం అధ్యక్షుడిగా పాలాది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు కృష్ణాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్య కార్యదర్శి మాధవాచారి, యువత విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, అశోక్, ప్రవీణ్‌గౌడ్, రాజు, వెంకటేశ్, నవీన్, హరికృష్ణ, భరత్ పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు జేఏసీ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: స్థానిక పరిశ్రమలలో యువతకు ఉద్యోగాల రూపకల్పనలో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జేఏసీ తాలుకా అధ్యక్షుడు జనార్దన్ కోరారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 500 పరిశ్రమలు ఉంటాయని, మరెన్నో మల్టీ నేషనల్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయన్నారు. యువతకు సరైన శిక్షణ లేకపోవడంతో ఇతర రాష్ట్రాల వారు ఇక్కడి పరిశ్రమలలో ఉద్యోగాలు చేస్తున్నారని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో విద్యార్థుల కోసం ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతాంగానికి సాగునీరందించేందుకు నిర్మిస్తామని చెప్పిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తిచేసి వ్యవసాయ రంగానికి సాగునీరందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, జేఏసీ నాయకులు నక్కబాల్‌రాజ్, రాము, అర్జున్‌కుమార్, బాదెపల్లి సిద్ధార్థ, నర్సింలు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రైతును రాజును చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా రైతుభరోసా ఎకరాకు రూ.6 వేలతో పాటు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ, ఉపాధి కూలీలకు, రూ.6 వేలు విడుదల చేసిన సందర్భంగా.. బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఇదీ రైతు సంక్షేమ ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బాలరాజు, రాజేశ్, షాబుద్దీన్, ఇమ్రాన్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్, బ్రహ్మాచారి, చందోజీ, సత్యం, లక్పతినాయక్, లక్ష్మణ్‌నాయక్, పర్వతాలు, బిక్షపతి, జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్‌ల కారణంగా అల్వాల, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు గురువారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఈశ్వర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో మధ్యాహ్నం 2.30ల గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామని, ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భీమ్

చేవెళ్ల: కుల అహంకార హత్యలు ఇన్నేళ్ల స్వాతంత్ర్యంలో ఇంకా కొనసాగటం బాధాకరమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భీమ్ అన్నారు. చేవెళ్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలోని సూర్యాపేటలో మాల సామాజిక వర్గానికి చెందిన మాల బంటి(వడ్లకొండ కృష్ణ)ని కుల అహంకారంతో హత్య చేయడాన్ని త్రీవంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కులరహిత సమాజాన్ని నిర్మించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మాల బంటిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా మాలలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన కవులు, మేధావులు, ఉద్యమకారులపై పాటలు, రచనలు, మాటలతో దాడులు జరుగుతున్నాయన్నారు. సమాజం ముందు మాల సమాజాన్ని దోషులుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా మాల సమాజం మేల్కొని మాలల అస్తిత్వం కోసం పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. కుల అహంకార దాడులను అరికట్టాలన్నారు.

ఫంక్షన్ హాళ్లపై కేసు నమోదు

శంకర్‌పల్లి: నిబంధనలు అతిక్రమించి ఫంక్షన్ హాలులో డీజే సౌండ్ సిస్టం నడిపిన రెండింటిపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లిలో బుధవారం మణిగార్డెన్, మోయిన్ ఫంక్షన్ హాళ్లలో డీజేలు పెట్టి శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్నట్లు ఫిర్యాదు అందగా.. పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం హాళ్ల యాజమానులతో పాటు డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సౌండ్ సిస్టం పెట్టుకోవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

ఆమనగల్లు: ఉర్సు ఉత్సవాలను బుధవారం ముస్లిం మత పెద్దలు అబ్దుల్ నయీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లి మండల పరిధి వెల్జాల గ్రామంలోని దర్గా వద్ద ఉత్సవంలో భాగంగా ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతిహా సమర్పించారు. మత పెద్దలు అబ్దుల్ ఖలీం, అబ్దుల్ రహీం, బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు సీఎల్. శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్‌ను ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలీ, రెహ్మాన్, ఫరూక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఈనెల 31న మొగిలిగిద్దకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు విద్యను పూర్తిగా గాలికి వదిలేశారని, దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచారని, ప్రతీ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ నెల 31న మొగిలిగిద్ద సీఎం రాక

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల వేడుకలను ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు, ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమంపై సాయంత్రం 4గంటలకు గ్రామ శివారులోని మైదానంలో 10వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని తెలిపారు. మొగిలిగిద్ద గ్రామ వాసి అయిన ప్రొఫెసర్ హరగోపాల్ వృద్ధాప్యంలో కూడా విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సీఎం రాకతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ నిర్వహణకు స్థల పరిశీలన

మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు గ్రామ శివారులోని కందివనం రోడ్డులో ఉన్న 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైదానాన్ని బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పోలీసు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 10 వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సయ్యద్ సాధిక్, ఇబ్రహీం, ఖదీర్, ముబారక్, కందివనం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కనిపించని మార్పు!

- చెత్త వేయొద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం
- చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల వినతి

శంకర్‌పల్లి: ప్రస్తుత కాలంలో ఒకరు మరొకరికి చెబితే విని మారే పరిస్థితిలో లేరు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇచ్చట చెత్త, మూత్రవిసర్జన చేయరాదని విద్యుత్ శాఖ అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ కొంత మందిలో కనీస మార్పు రావడం లేదు. శంకర్‌పల్లి–సంగారెడ్డి ప్రధాన రహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీని చుట్టు పక్క కాలనీల ప్రజలు నిత్యం చెత్తను తీసుకొచ్చి వేయడంతో అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు పుర ప్రజలు కోరుతున్నారు.



ఫ్లెక్సీల ఎదుట వేసిన చెత్తా, చెదారం

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం



కొందుర్గు అధ్యక్షుడిగా లక్ష్మికాంత్‌రెడ్డి



జిల్లేడ్ చౌదరిగూడ అధ్యక్షుడిగా రాజు

కొందుర్గు: బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడిగా గంగన్నగూడకు చెందిన చిట్టెం లక్ష్మికాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మికాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. దీంతో నాకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడిగా ఎదిర గ్రామానికి చెందిన గడ్డమీది రాజు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కొందుర్గుకు చెందిన ఈసరి సత్యనారాయణ, చౌదరిగూడ మండలం తూంపల్లికి చెందిన బోయ కుర్మయ్య ఎన్నికయ్యారు.

కేశంపేట అధ్యక్షురాలిగా రొల్లు రాధిక



రాధిక

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన రొల్లు రాధికను బీజేపీ మండల అధ్యక్షురాలిగా నియమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఈ నియామకం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా రాధిక తెలిపారు. తన ఎంపికకు కృషి చేసిన ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నందిగామ అధ్యక్షుడిగా వడ్ల అరవింద్



అరవింద్

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన వడ్ల అరవింద్ బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు నూతన అధ్యక్షుడు అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డికి, రాష్ట్ర నాయకులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. మండలంలో పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తానన్నారు.

‘లక్ష డప్పులు’ జయప్రదం చేయండి

యాచారం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. బుధవారం మండల పరిధి నందివనపర్తి గ్రామంలో సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు మూలి వెంటకయ్య ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కుర్మ, యాదవ, ముస్లిం తదితర కుల మత పెద్దలు ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. మాదిగ, మాదిగ ఉపకులాలు చేస్తున్న రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం న్యాయమైనదేనని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జంగయ్య, శ్రీకాంత్, మహేశ్, ముత్యాలు, బుగ్గరాములు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కడ్తాల్: డిసెంబర్ 31 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు, ఇదీ వరకు పట్టాదారు పాసుపుస్తకం ఉండి, రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని వారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం నింపి, దానికి పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను జతపరిచి వ్యవసాయ శాఖ కార్యాలయం లేదా రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ నెల 31లోగా అందజేయాలని సూచించారు.